# కూడళ్లు, రోడ్ల మధ్యలో సుందరీకరణ పనులు

తిరుపతి తుడా: తిరుపతి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె బుధవారం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అధికారులతో కలిసి 3, 12 ,13, 14 డివిజన్లలో తనిఖీలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని కూడళ్లు, వీధుల, కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి పవిత్రతను దృష్టిలో ఉంచుకొని నగరంలోని ప్రధాన మార్గాలు, కూడళ్లను సుందరీకరించనున్నట్లు చెప్పారు. కూడళ్లు, రోడ్డు డివైడర్ల మధ్య అందమైన మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్రజలకు క్లీన్ తిరుపతితో ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించడమే ముందున్న లక్ష్యమన్నారు. ప్రజలు స్వచ్ఛ తిరుపతిలో భాగస్వాములు కావాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని చెప్పారు. ఖాళీ స్థలాలు, రోడ్లు, కూడళ్లు, కాలువలో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌ఈ మోహన్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.కే బాబు, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరికృష్ణ, డీసీపీ శ్రీనివాసులు, ఏసీపీ బాలసుబ్రహ్మణ్యం, కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, డీఈ సంజయ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.


నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ హరిత

# నియోజకవర్గ ప్రజలందరికీ వైద్య సేవలు

భాకరాపేట: ఆరోగ్యమే మహా భాగ్యమని, ఇంట్లో అందరూ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం భాకరాపేటలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సందర్శించారు. వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కువ శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారు పనుల్లో పడి తమ ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో వారికి వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్యులు 2400 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ సాకిరి భూపాల్, వైస్ ఎంపీపీ సునీత, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ మదనమోహన్‌రాజు, వైద్యాధికారులు శశికళ, అలెగ్జాండర్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్ తదితరులు పాల్గొన్నారు.


రక్త పరీక్షలు చేయించుకుంటున్న కౌంటర్‌ను పరిశీలిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

# అభివృద్ధి పనులకు వరల్డ్ బ్యాంకు సహకారం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టే అభివృద్ధి పనులకు వరల్డ్ బ్యాంకు సహాయ సహకారాలు అందజేస్తుందని బ్యాంకు ప్రతినిధి విజయ్‌శేఖర్ తెలిపారు. ఆయన బుధవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆయనతో సమావేశమయ్యారు. తిరుపతి నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల గురించి వివరించారు. ప్రజలకు ఆధునిక, మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వాటికి అవసరమైన ప్రతిపాదనలను ఆయనకు అందజేశారు. ముఖ్యంగా రోడ్లు, యూడీఎస్, మురుగుకాలువలు, తాగునీరు సౌకర్యాల కల్పనకు సహకరించాలని కోరారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు, మల్టీలెవెల్ కార్ పార్కింగ్, షాపింగ్‌కాంప్లెక్స్‌లు, సముదాయాలు, మార్కెట్ల ఆవశ్యకతన వివరించారు. వరల్డ్ బ్యాంకు ప్రతినిధి విజయ్‌శేఖర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంపూర్ణ సహాయ, సహకారాలు అందించేలా చూస్తామన్నారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్‌ఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.


వరల్డ్ బ్యాంకు ప్రతినిధితో కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

# మైనారిటీల సమస్యలు పరిష్కరించాలని వినతి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని ముస్లిం, మైనారిటీల సమస్యలు పరిష్కరించాలని సయ్యద్ అహ్మద్ ఖాదరీ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో మైనారిటీ సంక్షేమ అధికారి చెన్నారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో ఉర్దూ టీచర్ల కొరత ఉందని, పోస్టులు భర్తీ చేయాలని కోరారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీ సంక్షేమ అధికారి చెన్నారెడ్డి మాట్లాడుతూ మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మహ్మద్ మాహిమ్, చిత్తూరు జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి వసీమ్, రామకుప్పం ప్రభుత్వ ఖాజీ మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

## ప్రకృతి ఆహారంతో మెరుగైన ఆరోగ్యం

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రకృతి ప్రసాదించే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండొచ్చని స్వమాక్స్ సీఈఓ విశ్వనాథం తెలిపారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా బుధవారం స్వమాక్స్ ఆధ్వర్యంలో చంద్రగిరిలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతులుగా జీవించడమే సమాజ శ్రేయస్సుకు మంచిదన్నారు. స్వమాక్స్ అధికారులు సుబ్రమణ్యం, రామనాథరెడ్డి, జయరామిరెడ్డి, నాబార్డ్ అధికారులు పూర్ణచంద్ర, ప్రసాద్, లోకేష్, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

## 10న మహతిలో విషిత సహన నృత్య అరంగేట్రం

తిరుపతి కల్చరల్: తిరుపతికి చెందిన ఎస్పీడీసీఎల్ రిటైర్డ్ ఎస్‌ఈ సుబ్బన్న మనవరాలు విషిత సహన అమెరికాలో భారతీయ సంప్రదాయ నృత్య శిక్షణ పూర్తి చేసుకుని ఈ నెల 10వ తేదీన మహతిలో భరతనాట్య అరంగేట్రం చేస్తున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సీఆర్‌కే. శేషగిరిరావు తెలిపారు. వారు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు.

## విద్యార్థి దశ నుంచే ధర్మంపై అవగాహన కల్పించాలి

తిరుపతి కల్చరల్: విద్యార్థి దశ నుంచే పిల్లలకు ధర్మాచరణ, హిందూ ధర్మంపై అవగాహన కల్పించాలని టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శ్వేత భవన్‌లో బుధవారం 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న టీటీడీ ఉద్యోగుల పిల్లలకు సనాతన హిందూ ధర్మంపై శిక్షణ ఇచ్చారు. శ్రీవేంకటేశ్వర దివ్య వైభవం, సనాతన ధర్మం -పరిచయ, నైతికత, ప్రవర్తన, హిందూ ధర్మంలో మంచి అలవాట్లు- శాస్త్రీయత, వ్యక్తిత్వ వికాసం- భగవద్గీత, యోగా-ధ్యానం అంశాలపై ఆయా రంగాల్లోని ప్రముఖులు శిక్షణ ఇచ్చారు. శ్వేత డైరెక్టర్ ప్రశాంతి పర్యవేక్షించారు.

## పేదోళ్లకు న్యాయం చేయండి

తిరుపతి అర్బన్: శెట్టిపల్లి భూముల సమస్యకు సంబంధించి పేదోళ్లు ఎక్కువ మంది ఉన్నారని, సమస్యను పరిష్కరించాలని తిరుపతి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కోరారు. ఆయన బుధవారం జేసీ డీకే బాలాజీని కలిసి చర్చించారు. ఆయన మాట్లాడుతూ భూములు సర్వే చేయించి తిరుపతి కార్పొరేషన్‌కు అప్పగించాలని తెలిపారు. స్పందించిన జేసీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీఓ కనకనరసారెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, డీటీ అశోక్, వామపక్ష నేతలు పాల్గొన్నారు.

## జిల్లా రిజిస్ట్రార్‌కు అభినందనలు

తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ తిరుపతి జిల్లా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీరామ్‌కుమార్‌ను బుధవారం దస్తావేజు లేఖరులు, అసిస్టెంట్లు, స్టాంప్ వెండర్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీఎం కేశవులు, దామోదరం, దేవరాజులురెడ్డి, వాసు, మాధవ, బావాజాన్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం

తిరుపతి లీగల్ : కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది దొరబాబు తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానన్న విషయాన్ని సీఎం జగన్ నిలబెట్టుకున్నారని తెలిపారు. న్యాయశాఖలో అనేక మంది ప్రయోజనం జరుగుతుందన్నారు.

## మహిళా యూనివర్సిటీ వద్ద మరో ఫ్రీ లెఫ్ట్

తిరుపతి తుడా: పద్మావతి మహిళా యూనివర్సిటీ- ఉప్పరపల్లి- వైకుంఠపురం కూడలి విస్తరణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం రాత్రి కమిషనర్ హరిత, అధికారులతో కలిసి మహిళా యూనివర్సిటీ- ఉప్పరపల్లి- వైకుంఠపురం కూడలిని పరిశీలించారు. మహిళా యూనివర్సిటీ ఆగ్నేయంలో స్థల సేకరణ చేసి, రోడ్డును విస్తరించి, ఫ్రీ లెఫ్ట్ అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ హర్షణీయం

తిరుపతి కల్చరల్: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాజారెడ్డి ప్రకటనలో తెలిపారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల గురించి పట్టించుకోలేదని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం అభినందనీయని కొనియాడారు.





## క్లుప్తంగా

### రూ.లక్ష విరాళం



పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బుధవారం మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఆర్.జయదేవ్‌నాయుడు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆయన చెక్కును ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషాకు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నగదును డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో ప్రతి ఏటా ఎస్‌ఆర్.జయదేవ్ నాయుడు, ఎస్‌జే.రాజేష్, ఎస్.శ్రీవల్లి పేర్ల మీద పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని వివరించారు.

### ఆర్థిక సాయం

తిరుపతి మంగళం: సరోవర్ స్టాండ్‌కు చెందిన జీపు డ్రైవర్ భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, ఆమె భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి జీపు డ్రైవర్ భాస్కర్ ఇంటి వద్దకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

### పోలీసులకు ఘన సన్మానం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్‌ఐ లక్ష్మీకుమారి, కానిస్టేబుళ్లు అయ్యప్ప, అమర్‌నాథ్‌రెడ్డి, శివప్రసాద్, ధనుంజయులునాయుడు, హేమ్‌లాల్, కృష్ణమూర్తి, నాగరత్న, నరేష్, రామచంద్రయ్య సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ అయ్యారు. వారిని సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు.

### ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



తిరుపతి కల్చరల్: దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేత కార్మికులు, డిజైనర్ల ఆధ్వర్యంలో ఫార్చ్యూన్ కెన్సెస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు టీవీ.రావు మాట్లాడుతూ ప్రదర్శనలో వివాహ శుభకార్యాలతో పాటు పండుగలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించేలా దేశంలో పేరుగాంచిన ఉప్పాడ, కళంకారీ, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కాశ్మీర్ సిల్క్, బ్లౌజులు, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రదర్శన గురువారంతో ముగుస్తుందన్నారు.



# దళితుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని దళితుల సమస్యలను పరిష్కరించాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సమతా సైనిక్ దళ్ రాయలసీమ జోన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళితుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో 2014 నుంచి గరగపర్రు, రావూరు, పెదగొట్టిపాడు, అగిరిపల్లి తదితర ప్రాంతాల్లో ఎస్సీలపై పెట్టిన కేసులను కొట్టేయాలని కోరారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను, భూమి కొనుగోలు పథకాలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడు పణీంధర్, రాష్ట్ర కార్యదర్శి టిఎస్.చిరంజీవి, ఉపాధ్యక్షుడు వేమూరి సుధాకర్, జిల్లా క్రమశిక్షణ విభాగం నేత రాధాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ వైద్యులుగా తీర్చిదిద్దండి

తిరుపతి తుడా: వైద్య విద్యార్థులను అత్యుత్తమ వైద్యులుగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాకులదేనని తస్ట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుచేతాబెనర్జీ కురుంద్కర్ తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో బుధవారం వైద్య అధ్యాపకులకు క్లినికల్ ప్రాక్టీస్, క్లినికల్ ట్రయల్స్, పరిశోధనపై శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ వైద్యవృత్తి ఉత్కృష్టమైందన్నారు. వైద్యరంగంలో క్లినికల్ ప్రాక్టీస్ ముఖ్యమైందన్నారు. అలానే పరిశోధనలపై దృష్టి సారించాలని, ప్రకృతి సవాళ్లను అధిగమించేందుకు పరిశోధనలు దోహదపడాలని కోరారు. క్లినికల్ ప్రాక్టీస్ సూత్రాలను గుర్తించి అందుకు అనుగుణంగా వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ ఎయిమ్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ వై.కే గుప్తా, అడ్మినిస్ట్రేషన్ శిక్షణపై వందనాచావ్లా, ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ జితేందర్ అహూజా, ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ లక్ష్మీదివ్య, యూనిట్ కో- ఆర్డినేటర్ ప్రతిభ, ప్రవంతి పాల్గొన్నారు.

# సమష్టి కృషితోనే తిరుపతి గంగమ్మ నాటకం విజయవంతం

తిరుపతి కల్చరల్: సమష్టి కృషితోనే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ పౌరాణిక నాటకం అద్వితీయమైన విజయం చేకూరిందని పలువురు వక్తలు తెలిపారు. అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఓ ప్రైవేటు హోటల్లో తిరుపతి గంగమ్మ నాటక కళాకారుల అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోరిక మేరకు తిరుపతి గంగజాతర సందర్భంగా అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్.రెడ్డి సారథ్యంలో తిరుపతి గంగమ్మ నాటకాన్ని రూపొందించి ప్రదర్శించడం గొప్ప విషయమని కొనియాడారు. బీఎస్.రెడ్డి మాట్లాడుతూ తిరుపతి గంగమ్మ నాటకాన్ని రూపొందించి ప్రదర్శించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆదేశించడంతో నిరంతరం శ్రమించి అద్భుత రీతిలో నాటకాన్ని రూపొందించామని తెలిపారు. దర్శకుడు, అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డిని ఈ సందర్భంగా కళాకారులు సత్కరించి అభినందించారు. కళాకారుల మధ్య ఇదే రోజు తన పుట్టిన రోజు జరుపుకోవడం పట్ల బీఎస్.రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సాహితీ వేత్తలు సాకం నాగరాజు, కోటా ప్రసాద్, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్. విశ్వనాథరెడ్డి, బ్లిస్ హోటల్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి, రిటైర్డ్ బ్యాంక్ అధికారి ఎం.చంద్రారెడ్డి పాల్గొన్నారు.


దర్శకుడు బీఎస్.రెడ్డిని సత్కరిస్తున్న కళాకారులు

# ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ


పెళ్లికానుక అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్/పాకాల/భాకరాపేట: తిరుపతి రూరల్ మండలం పైడిపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన పి.జ్యోష్న, వెంకటేష్, పాకాలకు చెందిన గణపతి, పవిత్ర, వరుణ్‌కుమార్‌రెడ్డి, లిఖిత, చక్రధర్‌రెడ్డి, దివ్యశ్రీ, మద్దినాయనపల్లి పంచాయతీకి చెందిన రమేష్, పావని, చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ కురవపల్లెకు చెందిన శ్రావణి, జనార్దన్‌కు పెళ్లి నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అ దజేశారు. తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, పాకాల జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, సర్పంచ్ కస్తూరి, ఎంపీటీసీ స్వర్ణ, విశ్వనాథరెడ్డి, జంగావాండ్లపల్లె సర్పంచ్ సింహాల విమల తదితరులు పాల్గొన్నారు.


పాకాల: పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు


భాకరాపేట: పెళ్లి కానుక అందజేస్తున్న సర్పంచ్ విమల